ప్రజాశక్తి
మంగళవారం 3 అక్టోబర్ 2023



రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 6 నుంచి 8వరకు గుంటూరు జిల్లా పల్నాడులో జరగబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి తిమ్మక దీపక్ ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయులు పత్తిక చంద్రమోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఉమ్మడి జిల్లా సీతానగరంలో జరిగిన అండం-17 వాలీబాల్ పోటీల్లో దీపక్ గెలిచాడని, దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిక గోవిందరావు, వార్డెన్ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు కష్ణారావు, తిరుపతి అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ఆకలి మంటల్లో జ్యూట్ కార్మికులు

- 16నెలలుగా మిల్లు అక్రమ లాకౌట్
- చర్చలకు రాని యాజమాన్యం
- 42రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షలు
- ఇదీ మన్యం జిల్లాలో ఏకైక పరిశ్రమ దుస్థితి



మూతపడ్డ జ్యూట్‌మిల్లు

ప్రజాశక్తి -సాలూరు

మన్యం జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ ఆంధ్రా ఫైబర్స్ జ్యూట్ మిల్లు మూతపడి 16నెలలు దాటిపోయింది. మిల్లు యాజమాన్యం అక్రమ లాకౌట్ ప్రకటించడంతో 1200 కార్మిక కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఎవరి దగ్గరకి వెళితే తమ బతుకులు బాగు పడతాయో తెలుసుకుని అందరి గడపలూ కార్మికులు తొక్కుతున్నారు. మిల్లు మూతపడడంతో కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ఎక్కడ బతుకు తెరువు కనిపిస్తుందో అక్కడకి వెళ్లిపోవాలన్న ఆశగా ఎదురు చూస్తున్నారు. కుటుంబాలను పోషించుకోడానికి మరో గత్యంతరం లేక కొంతమంది కార్మికులు తోపుడు బండ్లు నడుపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. మరి కొందరు టీ దుకాణాల నిర్వహణలో ఉన్నారు. కొంతమంది వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. గత 42రోజులుగా కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన జ్యూట్ మిల్లు కార్మికులు దశలవారీ పోరాటానికి నడుం బిగించారు. ధర్నాలు, కుటుంబ సభ్యులతో ర్యాలీలు చేశారు. ఫ్యాక్టరీ గేటు ముందు రిలే దీక్షలు చేపడుతున్నారు.

నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్న యాజమాన్యం

మండలంలోని జీగిరాం జూట్ మిల్లును తెరిపించడంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోంది. కార్మికశాఖ జాయింట్ కమిషనర్ వద్ద కార్మిక సంఘాలతో చర్చలకు రెండు సార్లు డుమ్మా కొట్టింది. ఈ రెండు సార్లు ఎంతో ఆశతో కార్మిక సంఘాల నాయకులు జెసిఎల్ వద్ద చర్చలకు హాజరయ్యారు. అయితే యాజమాన్య ప్రతినిధులు హాజరు కాలేదు. దీంతో యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే కార్మికుల పట్ల మొండిగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డిప్యూటీ సిఎం లేఖ రాసినా

జీగిరాం జ్యూట్ మిల్లు కార్మికులు జెఎసి ఆధ్వర్యాన అక్రమ లాకౌట్ సమస్యను డిప్యూటీ సిఎం రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. మిల్లును తెరిపించడంలో యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. దీంతో ఆయన ఘాటుగా కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఆయన లేఖ రాసిన తర్వాత చర్చలకు పిలిచినా యాజమాన్యం హాజరు కాలేదు. యాజమాన్యం మొండి వైఖరి కార్మిక శాఖ ఉన్నతాధికారులు కఠినంగా స్పందించాల్సి ఉన్నప్పటికీ అటువంటి దాఖలాల్లేవు.

మిల్లు ఆస్తుల్ని విక్రయించే యత్నంలో యాజమాన్యం

1986లో ఆంధ్రా ఫైబర్స్ జ్యూట్ మిల్లును అప్పటి టిడిపి ప్రభుత్వం స్థాపించింది. అత్యంత వెనుకబడిన గిరిజన ప్రాంతంలో గిరిజనులకు ఉపాధి కల్పన ప్రధాన ధ్యేయంగా జూట్ మిల్లును ప్రారంభించారు. సుమారు 50ఎకరాల భూములు సేకరించి మిల్లు, కార్మికుల నివాసానికి కాలనీ ఏర్పాటు చేశారు. క్రమేణా మిల్లు నిర్వహణ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకోవడంతో ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రయివేటు యాజమాన్యం కొంతకాలం సజావుగా నడిపించి జ్యూట్ కొరత సాకుగా చూపి కొంతకాలం మిల్లును మూసివేసింది. కరోనా సంక్షోభ సమయంలో మిల్లును పూర్తిగా మూసివేశారు. గత 16నెలలుగా మిల్లును అక్రమంగా లాకౌట్ ప్రకటించింది. కార్మిక సంఘాలతో చర్చలకు కూడా యాజమాన్యం వెనుకాడుతోంది. జాతీయ రహదారి-26 కి పక్కనే ఉన్న మిల్లు ఆస్తులకు మార్కెట్ విలువ బాగా పెరిగింది. దీంతో యాజమాన్యం ఆస్తులను విక్రయించే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే మిల్లు ఆస్తులు ప్రభుత్వం పేరిట రెవెన్యూ రికార్డుల్లో ఉండడంతో అమ్మకానికి వీలు కాని పరిస్థితి నెలకొంది. దీంతో యాజమాన్యం కోర్టులో కేసు వేసినట్లు తెలుస్తోంది. కోర్టు కేసు తెగేదాకా యాజమాన్యం మిల్లును మూసివేసే ఉద్దేశంతో వున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి.



సైకిల్‌యాత్ర ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్
- ప్రారంభమైన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలోని విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రామ్మోహన్ పిలుపునిచ్చారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను పాచిపెంటలో సోమవారం రామ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై ఈనెల 2 నుంచి 11 వరకు 400 కిలోమీటర్లు ఈ సైకిల్ యాత్ర జరుగుతుందన్నారు. ప్రధానంగా సంక్షేమ హాస్టళ్లకు బకాయిలు ఉన్న మెస్, డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలలో 117 జీవో రద్దుచేసి పాఠశాల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. అలాగే ప్రతి గ్రామంలో ఒకటి నుండి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న అమ్మఒడి, వసతి, విద్యా దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం చేయాలని. జిల్లాలో పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్ల సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, బాలికల హాస్టళ్లలో శానిటరీ వాస్కిల్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. పాచిపెంటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, సాలూరు పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాల నిర్మించాలని, మక్కువలో పోస్టుమెట్రిక్ హాస్టళ్లు నిర్మించాలని, సీతానగరంలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను నిర్మించాలని, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకొండలో గిరిజన పోస్ట్ మెట్రిక్ కాలేజీ బాలుర హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని, నియోజకవర్గ కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, సీతంపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. గుమ్మలక్ష్మీపురం పోస్టుమేట్రిక్ హాస్టలుకు అదనపు భవనం ఏర్పాటు చేయాలని, కురుపాంలో సొంత భవనం ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని, ఎస్‌సి, బిసి పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో క్రీడ మైదానాలు ఏర్పాటు చేసి, క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరావు, రాజు, సహాయ కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు. వీరికి మద్దతుగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలరాజు, మండల కార్యదర్శి బోను గౌరు నాయుడు పాల్గొన్నారు.



సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రారంభమైన సిపిఎం ప్రజారక్షణభేరి యాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బిజెపి మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడే సమయం ఆసన్నమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. తొలుత స్థానిక బస్టాండ్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహానికి వేణు పూలమాలవేశారు. అక్కడి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు మతసామరస్యం, బిజెపి ప్రజాస్వామిక హక్కులపై దాడి, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని నినాదాలు చేస్తూ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద మోడీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా గాంధీ జయంతి నుంచి నవంబర్ 7 వరకు సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్రలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులు, దేశ, ప్రజా రక్షణకు మరో చారిత్రాత్మక పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోడీ వత్తాసుతోనే జగన్ ప్రజలపై భారాలు మోపుతున్నారని, అడ్డగోలు పాలన సాగిస్తున్నాడని మోడీని ఓడిస్తేనే జగన్ పాలన అంతమవుతుందని చెప్పారు. టిడిపి పతనమే బిజెపి లక్ష్యమన్న వాస్తవాన్ని గుర్తించకుండా మోడీ వెంటపడుతోందని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బిజెపి మింగేసిందన్నారు. కేంద్రం వత్తిడికి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై అనేక రూపాల్లో విద్యుత్ భారాలు మోపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, కె.సాంబమూర్తి, పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.సన్యాసిరావు, తులసి, వరలక్ష్మి, బి.వెంకటరమణ, రెడ్డి ఈశ్వరరావు, జి.వెంకటరమణ, రామారావు, వెన్నెల వేణు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కార్మికులు ఇ-శ్రమ్‌లో నమోదు కావాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

అసంఘటిత, వలస కార్మికులు ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జోన్ - 1 కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ (విశాఖపట్నం) ఎం.రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసంఘటిత, వలస కార్మికులకు ఉచితంగా ఇ-శ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సల్ అకౌంట్ నెంబర్ (యుఎఎన్) కేటాయిస్తామన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డు జారీ చేసి పంపిణీ చేస్తారని చెప్పారు. గుర్తింపు కార్డు కలిగిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం కలిగినా రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. దీనికి జిల్లా స్థాయిలో కలెక్టరు ఆధ్వర్యంలో సభ్యులుగా ఎస్‌పి, డిఎంహెచ్‌ఒ, కార్మికశాఖ అధికారి, మెంబర్ సెక్రటరీగా డిఆర్డిఎ పిడితో జిల్లా స్థాయి కమిటీ ఉంటుందని, ఆ కమిటీ ధరఖాస్తులు పరిశీలిస్తుందని తెలిపారు. ఈ శ్రమ్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికులకు రేషన్ కార్డులు లేకపోతే సమీపంలోని గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసి ఉంటే పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటుందన్నారు.

క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందాలి

ప్రజాశక్తి - భామిని

గ్రామస్థాయిలో ప్రజలందరికీ వైద్యసేవలు అందాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. మండలంలోని ఘనసరలో సంకల్ప్ సప్తాహ్, బొడ్డగూడలో ఆయుష్మాన్ భవ గ్రామసభ వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని ఆశావహ బ్లాక్‌గా కేంద్రప్రభుత్వం గుర్తించిందన్నారు. దీంతో మండలంలో వైద్య ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. గర్భిణీలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, తమ పేర్లను నమోదు చేయాలని, ఐడిలు పొందాలని, ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలని సూచించారు. పుట్టిన బిడ్డల బరువు గమనించాలని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సమస్యలు ఉండవని చెప్పారు. క్షయ గుర్తింపునకు పరీక్షలు నిర్వహించాలని, దాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పిఎంజెఎవై కార్డుల జారీ చేయాలని, ర్యాలీలు, అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. బొడ్డగూడ, దేవనాపురం గ్రామాల్లో పర్యటించి సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, వైద్యాధికారులు భానుప్రతాప్, ఫణికుమార్, బొడ్డగూడ సర్పంచ్ ప్రతినిధి అనంతరావు, మాణిగ సర్పంచ్ చంటి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ స్ఫూర్తితో కొత్త సంకల్పం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గాంధీజీ స్ఫూర్తిగా కొత్త సంకల్పం తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలాలంకరణ చేసి ఘన నివాళులు అర్పించారు. అంతనం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలకు అహింసా మార్గంలో రూపకల్పన చేసి గొప్ప మార్గదర్శకత్వం గాంధీ వహించారని కొనియాడారు. ఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలిచారని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సైతం పింగళి వెంకయ్య, పొట్టి శ్రీరాములు వంటి మహానుభావులు శిష్యులుగా చేరారని వివరించారు. మహాత్మా గాంధీజీ మార్గం అనుసరణీయం, ఆచరణీయం అని పేర్కొంటూ కొత్త సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. లాల్ బహదూర్ శాస్త్రి గొప్ప పరిపాలనా దక్షులని అన్నారు. నైతిక విలువలకు మారు పేరుగా నిలిచారని చెప్పారు. జై జవాన్, జై కిసాన్ అంటూ పిలుపునిచ్చి గొప్ప ప్రేరణ కల్పించారని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ అహింసావాదంతో మానవాళికి నూతన పంథాను చూపించారని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం ఐటిడిఎలో...

స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలలో ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ బాటలో నడవాలని పిలుపునిచ్చారు.

ఎస్పీ కార్యాలయంలో...

పార్వతీపురంరూరల్ :స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి డిఎస్పీ మురళీధర్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. నేటితరం యువతీ యువకులు గాంధీ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ముందుకు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్పెక్టర్ సిహెచ్.లక్ష్మణరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, జిల్లా ఆర్మడ్, స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్‌బి అధికారులు, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు, పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన

గరుగుబిల్లి : పార్వతీపురం బార్ అసోసియేషన్‌లో రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అహింస అన్నటువంటి విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. శాంతియుతంగా సమాజం ఉండేలాగా ప్రతి వ్యక్తి నడుచుకోవాలని తెలిపారు. అలాగే స్థానిక సబ్ జైలును సందర్శించి మహాత్మా గాంధీ స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చేసిన ఉప్పు సత్యాగ్రహాన్ని, అహింస సిద్ధాంతాలను ఖైదీలకు వివరించారు. సత్ప్రవర్తన కలిగి, తప్పుడు మార్గాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎ. రమేష్, బార్ వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి కూర్మినాయుడు, సెక్రటరీ పివి కృష్ణారావు, సీనియర్ అడ్వకేట్ టి.జోగారావు, ఎపిజి బొంగు సత్యనారాయణ, ఎపిపి గొర్లి వెంకట్రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి

ఐటిడిఎ కార్యాలయంలో...

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లీరాణి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత పనుకువలస సమీపంలో ఉన్న ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో సీనియర్ శాస్త్రవేత్త అధిపతి పి.సీతారాం గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపిడిఒ కొండపల్లి సత్యం పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిపిఒ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

రామినాయుడువలసలో 144 సెక్షన్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏనుగుల సంచారం ఉన్న జియ్యమ్మవలస మండలం రామినాయుడువలసలో 144వ సెక్షన్ అమలులో ఉందని జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన తెలిపారు. తహశీల్దార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని ఆమె చెప్పారు. ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రసూన కోరారు. ఈ మేరకు సోమ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు ఏనుగులు జియ్యమ్మవలస మండలం పెద మేరంగి కూడలి వద్ద రామినాయుడు వలస దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. కావున కన్నపుదొరవలస, పెద్దవలస, సుభద్రమ్మవలస, సీమనాయుడు వలస, భట్లభద్ర, నిమ్మలపాడు, వెంకట్రాజ పురం, ఎరుకులపేట, గౌరింపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. ఏనుగు "హరి" కొమరాడ మండలం నడిమివలస కొండపై ఉందని, రాత్రి సమయంలో కొండ దిగువకు వస్తుందని, తెల్లవారు జామున కొండ మీదకు వెళుతుందని తెలిపారు. రేగులపాడు, పెద్దకేర్జిల, చినకేర్జిల, బుజిగవలస, నడిమివలస మెట్ట, కోటిపాం, జంఝావతి, కుమ్మరిగుంట, ఆర్తామ్ గ్రామ ప్రజలు సాయంత్రం, తెల్లవారు జామున పొలాల్లోకి వెళ్లనప్పుడు, ప్రయాణాలు సాగించినపుడు అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ముందస్తు సమాచారాన్ని అటవీ అధికారుల నుండి తీసుకోవాలని ఆమె సూచించారు. హరి ఏనుగు సమాచారాన్ని - ఉలిపిరి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె సత్యనారాయణ 93984 68628, మిగిలిన ఏనుగుల సమాచారాన్ని బోరి బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.కిరణ్ 94405 95181 ఫోన్ చేసి పొందవచ్చని కోరారు.

5న సామూహిక గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పేదలందరికీ ఇళ్లు సామూహిక గృహ ప్రవేశాలు ఈనెల 5న జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లలో సామూహిక ప్రారంభోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మండలంలోని కృష్ణపల్లిలో నిర్వహించను న్నారు. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్ కుమార్ కృష్ణపల్లి గృహ నిర్మాణ లేఔట్‌ను జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. కృష్ణపల్లి లేఔట్‌లో పూర్తయిన ఇళ్లను, కాలనీ ఆర్చ్ నిర్మాణ పనులను, డ్రైనేజీ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సామర్లకోటలో జగనన్న కాలనీ లే అవుట్ వద్ద రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఎంపిక చేసిన కాలనీలో పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను సమాంతరంగా సామూహిక గృహ ప్రవేశాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణపల్లి కాలనీ లేఔట్ లో 124 ఇళ్లు మంజూరు కాగా 60 వరకు నిర్మాణాలు పూర్తి అయ్యాయి. ఆయా గృహాలకు ప్రవేశాలు జరగనున్నాయని వివరించారు. కాలనీ లేఅవుట్‌లో మురుగు కాలువ, ఇతర ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండడాన్ని పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా ఎప్పటి నీరు అప్పుడే కాలువల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలనీ మ్యాప్ ఆధారంగా అవసరమైన మౌలిక సదుపాయాలు యుద్ధప్రాతిపదికన కల్పించాలన్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్లకు అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కూలీలతో కాలనీ లే అవుట్ వద్ద ఉన్న జంగిల్‌ను శుభ్రపర్చాలని, ప్రవేశ మార్గం వద్ద ఆర్చ్ నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. ఆయా శాఖలకు దిశా నిర్దేశం చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సభా స్థలం వద్ద గహ నిర్మాణాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని మండలాల పూర్తయిన గహ నిర్మాణాల ఛాయాచిత్రాలు ప్రదర్శించాల న్నారు. పరిశీలనలో ఆర్‌డిఒ కె.హేమలత, హౌసింగ్ పీడీ టి.రమేష్, ఇఇ ఆర్‌వివి ప్రసాద్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ .ప్రభాకర్ రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.మల్లికార్జున, విద్యుత్ శాఖ ఎఇ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, అధికారులు

ఉద్యోగ కరదీపిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఉపాధ్యాయుడు బోనెల సత్యకుమార్ సంజీవి సంకలన పర్చిన ఉద్యోగ కరదీపిక పుస్తకాన్ని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, హెచ్‌ఒడిలకు, డిడిఒలకు పెన్షనర్లకు కరదీపిక తెలుగులో అనువదించడం వల్ల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఉపాధ్యాయుని ప్రయత్నాన్ని అభినందించారు. త్వరలో పెన్షనర్ దీపిక అనే పుస్తకాన్ని కూడా రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సమాచారం నిమిత్తము ప్రచురణ చేస్తున్నానని, భవిష్యత్తులో రాబోయే జీవోలను కూడా పొందుపరిచి ఎప్పటికప్పుడు రివైజ్డ్ ఎడిషన్ లను కూడా తయారు చేస్తానని సంకలనకర్త తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు జి.వి.ఆర్.ఎస్. కిషోర్, కొమరాడ ఎంఇఒ జె. నారాయణస్వామి, డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ పార్వతిపురం ఎటిఒ మన్మధ రావు, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ కే. జగన్నాధ రావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని జెఎసి నాయకులతో కలిసి ఆ ఉద్యోగులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద గాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు బివి రమణ, బి.ఈశ్వరరావు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, ఉద్యోగ భ్రత కల్పిస్తామన్న సిఎం హామీ నేటికీ అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ విరమణ సదుపాయాలు కల్పించాలని, ఉద్యోగులకు రూ.10 లక్షలు ఉద్యోగ విరమణ పరిహారం, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని, ప్రతినెల ఒకటో తారీఖున జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలన్నారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు వై.గౌరమ్మ, పి.క్రాంతి కుమార్, ఎం.కాంచన, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సర్వశిక్ష ఉద్యోగులు

ఘనంగా గాంధీ జయంతి


జాతి పిత మహాత్మాగాంధీ జయంతోత్సవాలు జిల్లాలో సోమవారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకు, విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

సాలూరు: మహాత్మా గాంధీ ఆశయాలకు టిడిపి సహా జనసేన పార్టీలు తూట్లు పొడుస్తున్నాయని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, టౌన్ సిఐ సిహెచ్ శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ ప్రయోగ మూర్తి పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేష్, పలువురు కౌన్సిల్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ గర్ల మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: చింతల గూడ వీధి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మేనేజర్ బిత్ర కృష్ణమూర్తి నాయుడు సోమవారం స్థానిక పాఠశాలలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆరిక రవికుమార్, పాఠశాల పూర్వ ఎస్ఎంసి చైర్మన్ జనపోజు వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి సిపిఎం నాయకులు సిపిఎం పట్టణ నాయకులు టి.రాముడు, టి.శంకర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.ఇందు, భారతి పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వర్తక సంఘం నాయకులు

వన్యప్రాణుల సంరక్షణపై ర్యాలీ

సాలూరు: వన్యప్రాణుల సంరక్షణ అందరి సామాజిక బాధ్యత అని అటవీ రేంజ్ అధికారి కె.రామారావు అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా నీడ్ స్వచ్ఛంద సంస్థ, అటవీ రేంజ్ కార్యాలయం సిబ్బంది సంయుక్తంగా స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే వన్యప్రాణుల సంరక్షణ అవసరమని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ శ్రీనివాసరావు, అటవీ రేంజ్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ: గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోటిపాము సర్పంచ్ ఎస్ సుగుణ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పంచాయితీ కార్యదర్శి హేమా, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలంలోని ఖరసువలస ఎంపియుపి పాఠశాలలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు సింగరాపు సింహాచలం పూలమాల వేసి నివాళులర్పించారు.

వీరఘట్టం: మహాత్మ గాంధీ జయంతి వేడుకలను సోమవారం బొడ్డపాడు గ్రామంలో ఎంఇఒ. ఆర్ ఆనందరావు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. దశమంతపురంలో విద్యార్థులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. చిట్టిపుడివలసలో ఉపాధ్యాయులు సాకేటి రాంబాబు, విద్యార్థులు, నడుకూరులో జనసేన నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, రాంబాబు, జనసేన జాని విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గాంధీజీ 154 జయంతిని పురస్కరించుకొని గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు విష్ణు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచి బి గౌరీ శంకర్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు. కేదారిపురం గ్రామంలో సర్పంచి బి. తులసమ్మ, రాయగడ జమ్ములో సర్పంచి పత్తిక అమల, ఎల్విన్ పేటలో సర్పంచి ఆర్ చైతన్య ప్రసంతి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. రెల్ల, మండ, పి. ఆమిటి, బాలేసు, దుడ్డుఖల్లు, చెముడు గూడ, ఇర్ల, వనకబడి గోయిపాక, చాపరాయివిన్నిడి, తాడి కొండ, లంబేసు, కుక్కిడి, ఇరిడి తదితర పంచాయితీల్లో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గాంధీ జయంతి సందర్భంగా మండల జర్నలిస్టులు ఎల్విన్ పేటలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. గత నాలుగున్నర ఏళ్లుగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదని, అక్రిడేషన్ల జారీ అరకొరకగా జరిగిందని, హెల్త్ కార్డులు పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని సమస్యలన్ని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ జర్నలిస్టులు సరిపల్లి శ్రీనివాసరావు, కంచర్ల రామారావు, మద్ది నాని, గంట పెంటయ్య, పైడా కొండలరావు, పాలక ప్రేమానంద్, ప్రకాష్ రావు, శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు పెంచాలి

పచ్చదనం పెంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకుని మొక్కలు పెంచాలని దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నాగరాజు, క్షేత్ర సహాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి బి. ప్రమీల ఆధ్వర్యంలో సోమవారం గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట వీరం నాయుడు. ఎంపిటిసి దండి ఏడుకొండలు, పద్మాపురం సర్పంచ్ బి వీరయ్య, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిడిఒ రమణమూర్తితో కలసి బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. వెంకంపేట పంచాయితీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి సర్పంచ్ తీళ్లకృష్ణారావు, వైఎస్ ఎంపిపి సిద్ధా జగన్నాధరావు, చిన బొండపల్లిలో సర్పంచ్ గండి శంకరరావులు నివాళులు అర్పించారు. గంగాపురం, నరిశిపురం, ములగ, తదితర పంచాయితీ కార్యాలయాలలో ఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది, క్షేత్రసహాయకులు అద్వర్యంలో గ్రామసభలు నిర్వహించి గ్రామంలో పనులు గుర్తించారు.

మహాత్ముని విగ్రహావిష్కరణ

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి - నందివానివలస మార్గంలో కొత్తగా నిర్మించిన జట్టు ట్రస్ట్ కార్యాలయంలో గాంధీ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎపి గాంధీ స్మారక నిధి కన్వీనర్ డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సంఘ సేవకులు, తేజో సంస్థ వ్యవస్థాపకులు పిఎస్ ప్రకాశరావు మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ సేవకు విస్తృత కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ సేవలను అభినందించారు. జట్టు ట్రస్ట్ భవన్‌లో కొత్తగా నిర్మిస్తున్న అతిథి గృహానికి రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో తోటపల్లి ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ మర్రాపు సత్యనారాయణ, శ్రీరామ చంద్రమూర్తి, డాక్టర్ ఎం.గోపీనాథ్, సరోజ్ ప్రహరాజ్, ఎం.వాసు దేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో సోమవారం గాంధీ సెంటర్‌లో గాంధీ జయంతిని గాంధీ విగ్రహ నిర్మాత స్వర్గీయ గుళ్లిపల్లి అప్పలస్వామి నాయుడు, సాధు తాతయ్య కుమారుడు గుళ్లిపల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.



సాలూరు : గాంధీ విగ్రహానికి పూలమాలవేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతానగరం: మండలంలోని లచ్చిపేట, గాదెలవలస, నిడగల్లులో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, వేణుగోపాలనాయుడు పూలదండలు వేసి నివాళులర్పించారు. అలాగే జనసేన నాయకులు గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి నివాళ్లు అర్పించారు. స్థానిక గాంధీ విగ్రహానికి పెద్ద భోగి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు మమ్మల్ని విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. చెల్లంనాయుడువలస ఎంపిఇపి స్కూల్ ఆవరణంలో హెచ్ఎం విజయకుమారి ఆధ్వర్యంలో విశ్రాంత హెచ్ఎం దాసరి పరశురాము మాస్టర్ సమక్షంలో అంగన్వాడీ కార్యకర్త, గ్రామ సచివాలయం కన్వీనర్ దాసరి నాగరత్నం, గృహసారధులు, గ్రామవాలంటీర్లు గాంధీ విగ్రహం వద్ద నివాళ్లు అర్పించారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మీసాల సూర్యనారాయణ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సంస్కృత ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు, తెలుగు ఉపాధ్యాయులు దన్నాన నారాయణరావు, కార్యాలయ సిబ్బంది అనూష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని పి.లేవిడిలో గాంధీ జయంతిని పురస్కరించుకొని ట్రైబల్ రైట్స్ ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఐ.రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నీలకంఠాపురం, గుమ్మ, వేగులవాడ, లేవిడి గ్రామాల సర్పంచులు అడ్డాకులు మన్మధరావు, ఆరిక గోపాలరావు, భుజంగరావు, వెంకట్రావు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలో సచివాలయాల్లో, పాఠశాలల్లో సిబ్బంది గాంధీజీ విగ్రహానికి పూలమాలనేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

సాలూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికులను చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్ సోమవారం సన్మానించారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పట్టణ పారిశుధ్యం నిర్వహణలో పనిచేస్తున్న కార్మికులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.జయరాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు, ఎఇ సూరి నాయుడు, మేనేజర్ రాఘవాచార్యులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్: 104 ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. 104 యూనియన్(సిఐటియు) అధ్యక్షులు డి. ఆనందరావు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ 104 ఎంఎంయూ ఉద్యోగులు గ్రామాల్లో అనేక వైద్య సేవలు చేస్తున్నారు కానీ ప్రభుత్వం వీరి సేవలను గుర్తించడం లేదన్నారు. 2019 అక్టోబర్ 31న సిఎం 104 ఉద్యోగస్తులకు అనేక హామీలు ఇచ్చినప్పటికీ అమలు చేయలేదనీ, ఆయన ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 104 ఎంఎంయు వాహన సేవలు గతం మాదిరిగానే ప్రభుత్వం నిర్వహించాలన్నారు. జీవో నెంబర్ 4459 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, యాజమాన్యం చెల్లించవలసిన యంప్లోమేర్ కంట్రిబ్యూషన్ అరబిందో యాజమాన్యం చెల్లించాలని, డీఎస్సీ డాట్ ఆర్వోఆర్ ద్వారా నియమించిన సీనియర్ డ్రైవర్లకు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి స్లాబ్ సిస్టం ఆటోమేటిగ్గా అప్డేట్ చేయాలని కోరారు. ప్రతి నెల వేతనాలు చెల్లించాలి బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు స్థానిక ప్రదేశాలకు బదిలీ అవకాశం కల్పించాలని, ఫుడ్స్ ట్రావెల్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. వాహనంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని, వాహనాలకు సకాలంలో సర్వీసు, ఫిట్నెస్, ఇన్సూరెన్స్ చేయాలని, ఉద్యోగస్తులకు హెల్త్, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఉద్యోగ భద్రత ఇతర సమస్యల పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో 104 సంఘం కార్యదర్శి సిహెచ్ ప్రసాద్, కోశాధికారి ఎం జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలి

పార్వతీపురం రూరల్: బోయ వాల్మీకి, బెంతు ఒరియా కులాలను గిరిజన తెగల జాబితా కలపాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం తెలిపారని ఆ ఆమోదం రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని డికె పట్నం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర కులాలను గిరిజన తెగల జాబితాలో కలిపితే ప్రస్తుతం ఉన్న గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు గిరిజన అసెంబ్లీ, ఒక అరకు ఎంపి స్థానాలు వైసిపికి ఇస్తే ఇదా మీరు చేసింది అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో చంద్రబాబు తీర్మానం చేస్తే టిడిపిని గిరిజనులు వ్యతిరేకించారని, వైసీపీకి అదే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. తక్షణమే అసెంబ్లీ తీర్మానం, ఆమోదం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు ఆరిక ప్రభాకరరావు, రైతుకూలీ సంఘం నాయకులు జన్ని ముత్యాలు, జిఎస్‌యు నాయకులు పల్లా సురేష్, చెల్లూరి సీతారాం, సీతారాం, టిఎస్ఎఫ్ నాయకులు పాలవలస భగవాన్, ఆడారు గ్రామ పంచాయతీ సర్పంచ్ సీదరపు దిబ్బన్న, పువ్వుల అర్లప్ప, ఓటక సుందర్రావు, ఓటక ప్రశాంత్, సీదరపు రాజు ,పల్ల రవి,గిరిజన యువత, పెద్దలు పాల్గొన్నారు.

దేవనాపురంలో ఆరోగ్య రక్ష

సీతంపేట : మండలంలోని దేవనాపురం సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ కె. గీతాంజలి, తహశీల్దార్ ఎస్ నరసింహమూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏడు వైద్య పరీక్షలు 118 రకాల మందులు ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పించారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ముందుగానే సర్వే చేపట్టి క్యాంపునకు రోగులను సిబ్బంది తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కొండపల్లి సత్యం, వైద్యాధికారి భాను ప్రతాప్, కార్యదర్శి బి సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల కోసం వైద్య శిబిరం

పాలకొండ: స్థానిక ఆర్‌సిఎం లూర్దు మాత చర్చి ప్రాంగణంలో సోమవారం హ్యూమన్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం సామాన్యులకు అందుబాటులో ఉండేలా కేవలం రూ.200కే 36 రకాల శరీర భాగాల రిపోర్టులు అందిస్తున్నామని జూనియర్ డాక్టర్ వైఎస్ చిన్నారావు చెప్పారు. అలాగే శరీరంలోని అవయవాల పనితీరును గుర్తించి అవసరమైన ఆహార పదార్థాలు తెలియజేస్తామని, ఆయుర్వేద చికిత్సలు చేస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం కూడా చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడబ్ల్యూఏ ఉపాధ్యక్షులు పాలవలస రామినాయుడు, సంతోష్ బాబు, చంద్రశేఖర్ ఉన్నారు.

గ్రామసభ ద్వారా పనులు గుర్తింపు

భామిని: మండలంలోని బాలేరు, భామిని, బొడ్డగూడ, మణిగ పంచాయతీలలో ఉపాధి హామీ సిబ్బంది సోమవారం గ్రామ సభ నిర్వహించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో పంచాయతీ అభివృద్ధికి దశలు వారీగా చేపట్టవలసిన పనులు పై స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు చర్చించారు. బాలేరులో నిర్వహించిన గ్రామ సభలో జెసిఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ మాట్లాడుతూ స్థానికంగా ప్రాధాన్యత వున్న పనులును గుర్తించి, ఎన్ఆర్ఈజిఏ నిధులతో దశలు వారీగా పంచాయతీ లలో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలన్నారు. సంకల్ప్ సప్తహ్‌కు మండలం ఎన్నిక కావటంతో మరితంగా అభివృద్ధి పనులుకు నిధులు సమాకోరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ తులసిదాస్, మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, మాణిగా, బొడ్డగూడ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

5న బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్ రక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని అక్టోబర్ 5న విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ ఆర్చ్ కూర్మన్నపాలెంలో నిర్వహించబోయే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో సిపిఎం నాయకులు సోమవారం గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రజల త్యాగాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు అమ్మడానికి సిద్ధపడిందన్నారు. దీన్ని ముక్తకంఠంతో తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, సిఐటియు మండల కార్యదర్శి కే గౌరీశ్వరరావు, సిపిఎం మండల నాయకులు ఎం సన్యాసిరావు, పువ్వుల మోహన్ రావు, పాండు రంగారావు, ఎం నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మ చూపుతున్న వ్యవహారాన్ని ప్రజలంతా ఏకమై వ్యతిరేకించాలని ఐద్వా నాయకులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట భైరిపురం గ్రామంలో పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 5న విశాఖ స్టీల్ ప్లాంట్ గేట్ వద్ద జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలంతా తరలిరావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తాడంగ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

బలిజిపేట: ఈ నెలి 5న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ గేట్ కూర్మన్నపాలెంలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు కోరారు. మండల కేంద్రంలో సోమవారం గాంధీ జయంతి సందర్భంగా గాంధీ బొమ్మ దగ్గర నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ: విశాఖ స్టీల్ ప్లాంట్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం జరగకుండా ఆపే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను విరమించుకునే విధంగా ఆలోచింపచేయాలని కోరుతూ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మహాత్మ గాంధీ చిత్రపటానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే బ్యాంకులు, ఎయిర్ ఫోర్స్‌తో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం ఆపాలని డిమాండ్ చేశారు.

సాలూరు రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దంటూ ఈనెల 5న జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని మండలంలోని బట్టివలస, జిల్లేడువలసలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సభ్యులు గేమ్మెల జానకి రావు ఆవిష్కరించారు. ఈ బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని, కావున ఈ బహిరంగ సభను ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంతల శివ, మర్రి మసి, వంతల చిన్న తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వినూత్న నిరసన

ప్రజాశక్తి- సీతంపేట

శాంతియుత పోరాటానికి ప్రతీక అయిన జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రాజమండ్రి జైలోనూ, ఆ దీక్షకు మద్దతుగా ఆయన నారా భువనేశ్వరి నిరసన దీక్షకు సంఘీభావంగా పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జయకృష్ణ అల్లూరి సీతారామరాజు వేషంతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మక్కువ:** ప్రస్తుత వైసిపి ప్రభుత్వం మహాత్మా గాంధీ ఆశయాలను తుంగలో తొక్కిల పాలన సాధిస్తుందని టిడిపి నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జి.వేణు, ఎం.ప్రసాదరావు, సిహెచ్ తవిటి నాయుడు, పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు. **భామిని:** మండల కేంద్రంలో బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో మణిగ, బొడ్డగూడలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండలి కమిటీ సభ్యులు బిడ్డికి ప్రసాద్, మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, బాబురావు, లక్కయి, తబ్బాయి, నగేష్, జుజరో, అప్పన్న,



పార్వతీపురం :కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఏబరు, బులజంగో, కోరాడ రాజేష్ పాల్గొన్నారు. **సాలూరు:** సిఎం జగన్ మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ టిడిపి నాయకులు కార్యకర్తలు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ ఆధ్వర్యాన పట్టణ మండల నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పట్టణ నాయకులు, పాల్గొన్నారు. **పార్వతీపురంరూరల్:** చంద్రబాబు సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా పార్వతీపురంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షకు జనసేనతో పాటు బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల నుండి పెద్దసంఖ్యలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సంఘీభావం ప్రకటించారు. అలాగే చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పార్వతీపురం, కృష్ణపల్లిలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అద్యక్షులు జి.రవికుమార్, దొగ్గ మోహనరావు, వేణుగోపాలరావు, కొల్లి తిరుపతిరావు, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, కోల మధుసరిత, తాతపూడి వెంకటరావు, కోరాడనారాయణరావు, గొట్టాపు వెంకటనాయుడు, గర్భాపు ఉదయభాను, కోల వెంకటరావు, బార్నాల సీతారాం, జాగాన రవికుమార్, పాలకొండ రాజశేఖర్, సిరిపురపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **కురుపాం :** అధికార మదంతో రెచ్చిపోతున్న వైసిపికి భంగపాటు, టిడిపికి అఖండవిజయం తథ్యమని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా నిర్వహించిన సత్యమే జయతే అనే కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి లబ్ధిపొందాలని చూస్తున్న వైసిపి గుణపాఠం తప్పదన్నారు. అక్రమ కేసులో జైలుకెళ్లిన చంద్రబాబు బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుండెపోటుతో కమాటి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం


స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో కమాటీగా విధులు నిర్వహిస్తున్న పొందూరు మండలం కంచరం గ్రామానికి చెందిన కంచరాం పోలరావు(61) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వసతి గృహంలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకు 12 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కమాటీగా పోలరావు, రోజువారి కూలీగా శివ్వరి సూరి విధులు నిర్వహిస్తున్నారు. పోలరావు, సూరి వేరే గదిలో, విద్యార్థులు వేరే గదిలో పండుకుంటున్నారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి భోజనం అనంతరం పోలరావు, సూరి, విద్యార్థులు వేరే వేరే గదిలో పడుకున్నారు. సోమవారం తెల్లవారి 7గంటలు అయినప్పటికీ పోలారావు గదిలో నుంచి బయటికి రాకపోవడంతో విద్యార్థులు లేపే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ లేవకపో వడంతో వసతి గృహానికి సమీపంలో ఉన్న స్థానికులకు, సంక్షేమ అధికారి పి ధర్మరావుకు విద్యార్థులు సమాచారం అందజేశారు. సంక్షేమ అధికారి ఉన్నత స్థాయి అధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలరావు వసతి గృహంలోనే మృతి చెందడంతో విద్యార్థులు జీర్ణించుకోలేక బీతిల్లి పోతున్నారు. జిల్లా స్థాయి సంక్షేమం శాఖ అధికారి పి గోపినాథ్, వైస్ ఎంపిపి విజయ కుమారి, వసతి గృహానికి చేరుకుని విద్యార్థులకు ధైర్యం చెప్పి భోజన సదుపాయాలు కల్పించారు. మృతుడు పోలరావు 2021న బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు చెబుతున్నారు. ఆయన మృతి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వగ్రామైన కంచరం తరలించారు.

రావివలస హాస్టల్‌కు విద్యార్థులు తరలింపు

పోలరావు మృతి చెందడంతో విద్యార్థులను గరుగుబిల్లి మండలంలోని రాయవలస వసతి గృహానికి తరలిస్తున్నట్లు సంక్షేమ శాఖ అధికారి గోపీనాథ్ తెలిపారు. నాలుగైదు రోజుల వరకు వసతి గృహాన్ని మూసి వేస్తున్నామని తెలిపారు. వసతి గృహాన్ని ఐసోలేషన్ చేసేందుకు పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

మచ్చలేని పోలరావు

ఏ గృహంలో పనిచేసినా మచ్చలేని ఉద్యోగిగా పోలరావు విధులు నిర్వహించారని, వచ్చే ఏడాది



పోలరావు మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ఆగస్టులో పదవి విరమణ పొందాల్సిన ఆయన మరణం బాధాకరమని అధికారులతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఆక్రోశానికి గురయ్యారు. మృతునికి భార్య లత, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

నీడ కోల్పోయిన విద్యార్థులు

వసతి గృహానికి సమీపంలో ఉన్న ఎంపిపి పాఠశాల, కోమటి వీధి పాఠశాలల్లో విద్యార్థులు వసతి గృహం మూసివేతతో నిలువు నీడ కోల్పోయారు. ఈ పాఠశాలల్లో నాడు నేడు అభివృద్ధి పనులు జరుగుతుండంతో వీరందరికీ వసతి గృహంలోనే బోధించేవారు. ఇప్పుడు ఆయన మృతితో వసతి గృహం మూసివేయడం వల్ల ఇక్కడ విద్యార్థులకు బోధించేందుకు అవకాశం లేకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

వీరఘట్టం: మండలంలోని నడిమికెళ్ల గ్రామంలో సోమవారం పాలకొండ డిఎస్‌పి జీవి కృష్ణారావు ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు పై దర్యాప్తు చేపట్టారు. గత నెల 27న వినాయక నిమజ్జనంలో భాగంగా దళితులను దూషించి దుర్భాషలాడినట్టు ఇదే గ్రామానికి చెందిన చింతాడ శ్రావణ్ కుమార్, కొంగరాపు గంగరాజు, ముద్ద కృష్ణ, మరో నలుగురు వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత నెల 28న ఫిర్యాదు చేశారన్నారు. ఎస్ఐ ఎం వెంకటరమణ 29న కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పాలకొండ సిఐ ఎం మురళీధర్, ఎస్ఐ ఎం వెంకటరమణ, ఎఎస్ఐ కృష్ణంనాయుడు, విఆర్ఓ జి. రాజేంద్రప్రసాద్, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జిజె ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్య సిబ్బందితోపాటు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రెగ్యులర్ చేయాలి

సాలూరు: కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం ఉద్యోగులు డిప్యూటీ సీఎం రాజన్నదొరకి వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ సీఎం రాజన్నదొరని కలిసి కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరరావు, భారతి, షణ్ముం వినతి పత్రం సమర్పించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి కూడా వినతిపత్రం అందజేశారు.

డిఎ రెడ్డికి నివాళి

సాలూరు: పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు డెక్కిత అప్పారావు రెడ్డికి డిప్యూటీ సీఎం రాజన్నదొర సోమవారం నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో రాజన్నదొర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, కౌన్సిలర్‌లు రాపాక మాధవరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు కార్లు ఢీ

ప్రజాశక్తి -గరుగుబిల్లి

నాగూరు- దత్తివలస రహదారిలో ఖడ్గవలస నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న మారుతీ సుజికీ బ్రీజా కారును, వీరఘట్టం నుంచి పార్వతీపురం వైపు వస్తున్న హుందయ్ ఇయాన్ కారు సోమవారం బలంగా ఢీకొట్టింది. స్థానిక ఎస్ఐ ఎం. రాజేష్ తెలిపిన వివరాలిలావున్నాయి. మారుతీ సుజికీ బ్రీజా కారును హుందయ్యాన్ కారు ఢీకొన్న ఘటనలో బ్రీజా కారు పొలంలో బొల్తాపడింది. ఈ ఘటనలో కురుపాంకు చెందిన చౌదరి పోలం దొరకు చిన్న చిన్న గాయాలయ్యాయి. హుందయ్యాన్ కారులో ప్రయాణిస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ మేరకు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు చౌదరి పోలం దొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.